సాక్షి విశాఖపట్నం

మంగళవారం । 9 । జూలై । 2024



అర్జీలను పరిష్కరించండి

అర్జీదారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశించారు. 8లో



సింహాద్రి ఆవిర్భావ దినోత్సవం

సింహాద్రి ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సంస్థ పరిపాలన భవనం ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 8లో



నాకవుట్‌కు లయన్స్

ఏపీఎల్ మూడో సీజన్ నాకవుట్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. వైజాగ్ వారియర్స్‌పై 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. 8లో

న్యూస్‌రీల్

మత్స్యావతారంలో జగన్నాథుడు




దాబాగార్డెన్స్ : టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి మత్స్యావతారంలో సోమవారం దర్శనమిచ్చారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు స్వామికి మేలుకొలుపు, నాదస్వరం, 6 నుంచి 7 గంటల వరకూ నిత్య పూజ, 7 నుంచి 9.30 గంటల వరకూ జగన్నాథస్వామి ప్రార్థనా సంఘంచే ప్రార్థనా తరంగిణి, 9.30 నుంచి 10.30 వరకూ సామూహిక లలితా సహస్రనామ పారాయణ. మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సామూహిక భగవద్గీత, విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 9.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి, అర్చకులు పాణంగిపల్లి జగన్నాథాచార్యులు, పాణంగిపల్లి రంగనాథాచార్యులు, పాణంగిపల్లి కేశవాచార్యులు, యేడిద సురేషుబాబు పాల్గొన్నారు.

11న సీఎం చంద్రబాబు రాక

మహారాణిపేట: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 11న విశాఖ వస్తున్నారు. సీఎం పదవీ చేపట్టిన తర్వాత తొలిసారిగా విశాఖ వస్తున్న ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని సమాచారం. దీనిపై ఇంకా అధికారికంగా సమాచారం రావలసి ఉంది.

నిను మరువలేం రాజన్నా..



వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మేయర్ హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు

- వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి
- ఘనంగా వైఎస్సార్ 75వ జయంతి

బీచ్‌రోడ్డు : ప్రజల సమస్యలు తెలుసుకుని, వారి సంక్షేమానికి కృషిచేసిన దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వైఎస్సార్ 75వ జయంతి సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ప్రవేశ పెట్టిన ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి పథకాల్లో ప్రజల జీవితాల్లో మార్పు తీసుకొచ్చాయన్నారు. ఇప్పుడు కూడా దేశంలో అనేక రాష్ట్రాల్లో ఈ పథకాలు అమలు చేస్తున్నారంటే అందుకు వైఎస్సార్ కారణమన్నారు. ఆయన అడుగుజాడల్లో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గడిచిన ఐదేళ్లలో రాష్ట్రంలో అద్భుతమైన పాలన అందించారన్నారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రాజ్యసభ సభ్యులు వై.వి.సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకట కుమారి, పార్టీ నాయకులు

ప్రజల గుండెల నుంచి వైఎస్‌ను తొలగించలేరు

కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విధ్వంసకర పరిస్థితులను సృష్టిస్తుందని రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తున్నారని.. వీటిని న్యాయబద్ధంగా ధైర్యంగా ఎదుర్కొంటామన్నారు. ఎక్కడికక్కడ వైఎస్సార్ విగ్రహాలను ధ్వంసం చేస్తున్నారని.. కానీ ప్రజల గుండెల్లో ఆయన పట్ల ఉన్న ప్రేమను తొలగించలేరన్నారు. టీడీపీ నేతలు ధ్వంసం చేసిన వైఎస్ విగ్రహాలన్ని తిరిగి ఏర్పాటు చేస్తామన్నారు.



కొమ్మాది : దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతిని ఎండాడలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వుడా మాజీ చైర్మన్ పి.వి.ఎస్.ఎన్.రాజు ముందుగా మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సాంస్కృతిక విభాగం జోనల్ ఇన్‌చార్జ్ మారుతి ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, పార్టీ నాయకులు రొంగలి జగన్నాథం, పీలా ఉమారాణి, రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు ద్రోణంరాజు శ్రీ వాత్సవ్, నాయకులు జహీర్ అహ్మద్, పేర్ల విజయ్‌చందర్, అల్లంపల్లి రాజాబాబు, పి.అప్పన్న, శివరామకృష్ణ, పాత్రుడు, సూరిబాబు, ఎమ్. మల్లేశ్వరి, చుక్కల శేఖర్ పాల్గొన్నారు.



9వ వార్డులో పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న మేయర్ హరివెంకటకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, కార్పొరేటర్ స్వాతి



పేదలకు చీరలు,పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్

ఇసుక.. మస్కా

సామాన్యుడి నడ్డివిరిచేలా నూతన ఇసుక విధానం

అలవికాని హామీలతో అందలమెక్కిన కూటమి ప్రభుత్వం.. ఇప్పుడు తాము చెప్పిన అబద్ధాలపై 'ఇసుక' కోటలు కడుతోంది. ఇసుక ఉచితమని ఊదరగొట్టి.. ఇప్పుడు అబ్బే ఫ్రీ లేదు..తమకు కప్పం కట్టాల్సిందేనంటూ తెగేసి చెప్పేసింది. సామాన్యుడి నడ్డి విరిచేలా టన్ను ఇసుకకు ధర రూ.1394 చెల్లించాలని, దీనికి లోడింగ్ చార్జీలు, ట్రావెలింగ్ చార్జీలు అదనం అంటూ తేల్చేసింది. మరోవైపు లోడింగ్, రవాణా చార్జీల పేరుతో వ్యవస్థనంతా తమ గుప్పెట్లో పెట్టుకునేలా టీడీపీ నేతలు స్కెచ్ వేస్తున్నారు. ఇప్పటికే డిపోల్లో ఇసుకను దోచుకున్న టీడీపీ గద్దలు.. కృత్రిమ కొరత సృష్టించేందుకు సిద్ధమవుతున్నారు.



- టన్ను ఇసుక ధర అగనంపూడిలో రూ.1394, భీమిలిలో రూ.758
- లోడింగ్, రవాణా చార్జీల పేరుతో భారం
- ఎన్నికల ముందు ప్రతి యార్డులోనూ లక్షల టన్నుల ఇసుక నిల్వలు
- కూటమి నేతలు తరలించేయడంతో సగానికిపైగా తగ్గిన నిల్వలు
- కృత్రిమ కొరత సృష్టించి తరువాత విక్రయించుకొనేలా స్కెచ్

సాక్షి, విశాఖపట్నం : ఎలాంటి లాభాపేక్ష లేదంటూనే ఇసుక వ్యాపారానికి టీడీపీ ప్రభుత్వం పక్కా ప్రణాళిక సిద్ధం చేసింది. రీచ్‌ల నుంచి యార్డులకు తరలించడానికి అయ్యే నిర్వహణ వ్యయాన్ని మాత్రమే వసూలు చేస్తున్నామంటూ టన్ను ఇసుకను భారీ ధరకు విక్రయిస్తున్నట్లు ప్రకటించింది. నిన్నటి వరకు ఇసుక విధానంపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించి.. తాజాగా కూటమి ప్రభుత్వం చివరికి అదే పాలసీని అమలు చేస్తూ ధరలు పెంచేలా భారం మోపుతోంది. మొత్తానికి కూటమి ప్రభుత్వం ప్రజల కళ్లల్లో 'ఇసుక' కొట్టింది. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఇసుక అక్రమ రవాణాకు చెక్ పెడుతూ ఇసుక పాలసీ తెచ్చింది. మైనింగ్ శాఖ పర్యవేక్షణలో రీచ్‌ల్లో ఇసుక తవ్వి యార్డుల్లో నిల్వ చేసింది. అక్కడి నుంచి వినియోగదారులు టన్నుల వంతున కొనుగోలు చేసే విధంగా విధివిధానాలు ప్రకటించింది. ఇసుక పాలసీ తెచ్చి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసింది. ఇసుక విక్రయం ద్వారా వచ్చే ప్రతి రూపాయి ప్రభుత్వ ఖజానాకు చేర్చింది. అయితే అప్పట్లో టీడీపీ ఇసుక విక్రయాలపై దుష్ప్రచారం చేసింది. తమ ప్రభుత్వంలో ఉచితంగా ఇసుక సరఫరా చేశామంటూ గొప్పలు చెప్పుకుంది. అయితే వాస్తవానికి గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 'ఇసుక ఉచితం' పేరుతో రీచ్‌లను దోచుకున్నారు. ఆ ఐదేళ్లు ఏ రోజూ ప్రజలకు ఉచితంగా ఇచ్చిన పాపాన పోలేదు. ఇసుక రీచ్‌లో టీడీపీ నేతలు మోహరించి ట్రాక్టర్‌కు ఇంత, లారీకి ఇంత చొప్పున దోపిడీ చేసింది. నదుల్లో ఇసుక అడుగంటి పోయినప్పటికీ బావుల్లాంటి గోతులు పెట్టి సామాన్య కార్యకర్త నుంచి నియోజకవర్గ స్థాయి నేత వరకు రూ.కోట్లు కొల్లగొట్టారు. తాజాగా మరోసారి టీడీపీ ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తున్నామంటూ ప్రగల్భాలు పలికి, ఇప్పుడు ధరను నిర్ణయించి మరోసారి ప్రజలను చేస్తోంది.

టన్ను రూ.1394.. చార్జీలు అదనం

ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇసుక ఫ్రీ అంటూ ప్రచారం చేశారు. తీరా అధికారంలో వచ్చాక అగనంపూడి డిపోలో టన్ను ఇసుక రూ.1394, భీమిలి డిపోలో రూ.758కి విక్రయిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీనికి తోడు లోడింగ్, రవాణా చార్జీలు అదనంగా వసూలు చేయనున్నారు. గత ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో నలుమూలలా సమాన దూరంలో ఇసుక డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసింది. రాజమండ్రి, శ్రీకాకుళం నుంచి ఇసుకను సేకరించి.. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డులకు తరలించే ప్రక్రియ చేపట్టింది. ప్రతి రీచ్‌లోనూ టన్ను ధర సమానంగా నిర్ణయించింది. రీచ్‌ల నుంచి సమీప ప్రాంతాలకు తరలించే ఇసుక ధరలు దూరాన్ని బట్టి రవాణా చార్జీలతో కలిపి ధరలు నిర్ణయించింది. అయితే తాజాగా ప్రభుత్వం కేవలం జిల్లా వ్యాప్తంగా 2 డిపోలను ఏర్పాటు చేసింది. ఒక్కో యార్డు దగ్గర ఒక్కో ధర నిర్ణయించింది. రవాణా చార్జీలు ఇష్టం వచ్చినట్లు ఉంటుంది. దీంతో వినియోగదారులకు తడిసిమోపెడవుతోంది.



అగనంపూడి డిపో వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్

టీడీపీ నేతల గుప్పెట్లో.

ఇసుక విక్రయాలు మొదలుకొని.. లోడింగ్, రవాణా చార్జీల వసూళ్లు మొత్తం టీడీపీ నేతల కనుసన్నల్లోనే జరగనున్నాయి. లోడింగ్, రవాణా చార్జీలను ఆ ప్రాంత నేతలు ఎంత చెబితే అంత ఇవ్వాల్సిందే. లేదంటే ఇసుక దొరికే పరిస్థితి ఉండదని తెలుస్తోంది. పెద్ద మొత్తంలో ఇసుక కావాలంటే టీడీపీ నేతలను కలవాల్సిందేననే నిబంధనలు కూడా విధించే అవకాశముందని తెలుస్తోంది.

కృత్రిమ కొరత సృష్టించేలా..

వర్షాకాలంలో ఇసుక దొరికే అవకాశం లేదు. కాబట్టి టీడీపీ, జనసేన నేతలు ఇప్పటి నుంచే సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రస్తుతం రీచ్‌లలో ఉన్న ఇసుకను మాయం చేసేశారు. ఎన్నికల ముందునాటికి ప్రతి యార్డులోనూ లక్షల టన్నుల ఇసుక నిల్వలున్నాయి. ఇప్పుడు అగనంపూడి డిపోలో 97,782.36 మెట్రిక్ టన్నులు, భీమిలిలో 94,047 మెట్రిక్ టన్నుల ఇసుక మాత్రమే ఉందని అధికారులు చెబుతున్నారు. అధికారంలోకి వచ్చిన మరుక్షణమే.. ఆయా యార్డుల్లో ఇసుకను తరలించే పనిలో కూటమి నేతలు నిమగ్నమయ్యారు. రూ.కోట్లు విలువైన ఇసుకను రహస్య ప్రాంతాలకు తరలించేసుకున్నారు. ప్రస్తుతం డిపోలో ఉన్న ఇసుక విక్రయాలు పూర్తయితే.. రాబోయే వర్షాకాలంలో ఇసుక కొరత ఉంటుంది. ఈ సమయంలో దోచుకున్న ఇసుకను అధిక రేట్లకు విక్రయించేలా టీడీపీ నేతలు పన్నాగం పన్నుతున్నారు. మొత్తంగా ఇసుక పేరుతో మరోసారి దోపిడీకి టీడీపీ ప్రభుత్వం తెరతీస్తోంది.

పక్కాగా గిరి ప్రదక్షిణ ఏర్పాట్లు

- సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- కలెక్టర్ హరేందిర ప్రసాద్



గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్

మహారాణిపేట: ఈనెల 20న నిర్వహించనున్న సింహాచలం గిరి ప్రదక్షిణకు పక్కాగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా చూడాలని సూచించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమన్వయ అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్షించారు. గిరి ప్రదక్షిణ రోజు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు, రద్దీ ప్రదేశాలు వద్ద తోపులాటలు జరగకుండా బందోబస్తును ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. తాగునీరు, మరుగుదొడ్లు, పారిశుధ్యంతో పాటు రద్దీ ప్రదేశాల్లో లైటింగ్ ఏర్పాటు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. ఆలయ ఈవో శ్రీనివాసమూర్తి సూచనల మేరకు అంబులెన్సులు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని వైద్యాధికారులను కలెక్టర్ ఆదేశించారు. రద్దీ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సదుపాయం ఉండాలని, అవసరమైతే జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. అప్పుఘర్ వద్ద భక్తులు స్నానాలు చేసే సమయంలో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని మత్స్య శాఖ అధికారులను కలెక్టర్ సూచించారు. అలాగే ఈనెల 20,21వ తేదీల్లో మద్యం షాపులు మూసి వేయాలని ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలన్నారు. సమావేశంలో జాయింట్ పోలీస్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్.విశ్వనాథన్, సింహాచలం దేవస్థానం ఆలయ ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు డి.హుస్సేన్ సాహెబ్, ఎస్.భాస్కర్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్.ఈ మహేంద్రనాథ్, డీపీఆర్‌వో ఎస్.వి.రమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమల ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం : దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం విశాఖలో బయల్దేరే విశాఖ - కడప (17488) తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5 నుంచి 10 వరకు, తిరుగు ప్రయాణంలో కడపలో బయల్దేరే కడప - విశాఖ (17487) తిరుమల ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 6 నుంచి 11 వరకు రద్దు చేశామని వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- కింది రైళ్లు ఆగస్టు 2 నుంచి 10 వరకు రెగ్యులర్ మార్గంలో కాకుండా వయా గుణదల, రాయనపాడు మీదుగా రాకపోకలు సాగిస్తాయని, మళ్లించిన మార్గంలో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు హాల్ట్‌లను ఇస్తున్నట్లు తెలిపారు.
- విశాఖ - న్యూఢిల్లీ (20805) ఏపీ ఎక్స్‌ప్రెస్, భువనేశ్వర్ - ముంబయి (11020) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, షాలిమర్ - హైదరాబాద్ (18045) ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖ - లోకమాన్యతిలక్ టెర్మినస్ (18519) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్ - విశాఖ (12740) గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, ముంబయి - భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్, న్యూఢిల్లీ - విశాఖ (20806) ఏపీ ఎక్స్‌ప్రెస్, సాయినగర్ షిర్డీ - విశాఖ (18504) ఎక్స్‌ప్రెస్, లోకమాన్యతిలక్ టెర్మినస్ - విశాఖ (18520) ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.
- విశాఖ - హజరత్ నిజాముద్దీన్ (12803) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 5, 9న, విశాఖ - సాయినగర్ షిర్డీ (18503) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8న, టాటా - యశ్వంత్‌పూర్ (18111) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 8న, విశాఖ - హైదరాబాద్ - విశాఖ (12727/12728)) గోదావరి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 3 నుంచి 11 వరకు, విశాఖ - గాంధీధామ్ (20803) ఆగస్టు 8న, పూరి - ఓఖా (20819) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4న, గాంధీ ధామ్ - విశాఖ (20804) ఆగస్టు 4న, హజరత్ నిజాముద్దీన్ - విశాఖ (12804) స్వర్ణ జయంతి ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4, 7న, యశ్వంత్‌పూర్ - టాటా (18112) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 4న, సాయినగర్ షిర్డీ - విశాఖ (18504) ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 2, 10న మళ్లించిన మార్గంలో రాకపోకలు సాగిస్తాయి.

ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా అప్పారావు



జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను కలిసిన డాక్టర్ అప్పారావు

మహారాణిపేట: ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్తగా డాక్టర్ కె.అప్పారావు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇంతవరకు ఇక్కడ సమన్వయకర్తగా పనిచేసిన డాక్టర్ పీవీ మురళీకృష్ణను అమరావతిలో ఆరోగ్యశ్రీ కార్యాలయంలో జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. పార్వతీపురం మన్యం జిల్లా సమన్వయకర్తగా పనిచేస్తున్న అప్పారావును విశాఖకు బదిలీ చేశారు.

రిమాండ్ ఖైదీ ఆత్మహత్య

బీచ్‌రోడ్డు: మానసిక వ్యాధితో బాధపడుతున్న రిమాండ్ ఖైదీ నగరంలోని మానసిక ఆస్పత్రిలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మూడో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రకాశం జిల్లా మార్కాపురానికి చెందిన ఆరెమల్ల అశోక్ (24) రెండు హత్య కేసుల్లో ప్రధాన నిందితుడు. తన తల్లికి చంపిన కేసులో ఒంగోలు జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. అతని మానసిక పరిస్థితి బాగోలేకపోవడంతో విశాఖ సెంట్రల్ జైలుకు ఇటీవల తరలించారు. విశాఖలోని మానసిక ఆస్పత్రిలో మే 26 నుంచి చికిత్స పొందుతున్నాడు. అశోక్‌కు ఆదివారం రాత్రి నర్స్ భోజనం పెట్టి మందులను అందజేసింది. కాసేపటి తరువాత అశోక్ నేలపై పడి ఉండడాన్ని గార్డు గమనించాడు.

వెంటనే వైద్యులు వచ్చి పరిశీలించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. అశోక్ బెడ్ షీట్‌తో వార్డుకు మరుగు దొడ్డుకు మధ్యలో ఉన్న కిటికీ గ్రిల్‌కు ఉరివేసుకున్నట్లు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

డిగ్రీ స్పెషల్ కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో స్పెషల్ కేటగిరీ విద్యార్థుల ప్రవేశానికి ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభించామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్.ఐ.విజయబాబు తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన మంగళ,బుధవారాల్లో కూడా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, మాజీ సైనికుల పిల్లలు స్పెషల్ కేటగిరీ కింద వస్తారన్నారు. అలాంటి వారు ఈ ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలకు చెందిన విద్యార్థులందరి ధ్రువపత్రాలు కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరిశీలన ప్రక్రియ ప్రారంభమైందన్నారు.

నిరుద్యోగులకు ప్లంబింగ్‌లో శిక్షణ

మహారాణిపేట: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్స్ (నేక్) ఆధ్వర్యంలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ప్లంబింగ్‌లో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 8వ తరగతి విద్యార్హత కలిగిన వారికి సుమారు 3 నెలల పాటు ప్లంబింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్టు నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.వీ.ఎస్.ఎస్.రవికుమార్ తెలిపారు. జిల్లా పరిషత్ సమీపంలోని నేక్ కేంద్రంలో స్త్రీ, పురుష అభ్యర్థులకు వేర్వేరుగా శిక్షణ ఇవ్వనున్నామన్నారు. దరఖాస్తులకు ఎటువంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదని, నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 98668 83199, 85005 02395 నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను జిల్లా పరిషత్ దగ్గర ఉన్న నేక్ కార్యాలయంలో అందజేయాలని చెప్పారు.

రేపు కేంద్ర ఉక్కు మంత్రి స్టీల్‌ప్లాంట్ సందర్శన

ఉక్కునగరం: కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి బుధవారం స్టీల్‌ప్లాంట్ సందర్శించనున్నట్టు సమాచారం. కుమారస్వామిని ఇటీవల కూటమి నేతలు కలిసి స్టీల్‌ప్లాంట్ రావాలని ఆహ్వానించిన విషయం విదితమే. వారి విజ్ఞప్తి మేరకు ఆయన స్టీల్‌ప్లాంట్‌కు వస్తున్నట్టు తెలిసింది. మంగళవారం ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారు కానున్నట్టు సమాచారం.

అర్జీలను తక్షణం పరిష్కరించండి

అధికారులను ఆదేశించిన కలెక్టర్ హరేంధిర ప్రసాద్



అధికారులను ఉద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: ఆయా విభాగాల జిల్లాస్థాయి అధికారులు తప్పకుండా అర్జీదారులతో మాట్లాడాలని, సమస్య పూర్వాపరాలు తెలుసుకొని పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్ మీటింగ్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యను బట్టి ఆయా శాఖలకు సిఫార్సు చేశారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులను పిలిచి అర్జీని అందజేసి పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో అధికారులను ఉద్దేశించి పలు అంశాలపై మాట్లాడారు. ప్రజా సమస్యలపరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. సంబంధిత విభాగాల పరిధిలో నమోదైన ఫిర్యాదులను పూర్తిగా పరిశీలించి, అందులో ఐదు విభిన్నమైన అంశాలపై ఐదుగురి అర్జీదారులకు ఫోన్ చేసి మాట్లాడాలని, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని సూచించారు. ఒక జిల్లా స్థాయి అధికారి అర్జీదారుతో మాట్లాడితే వారిలో తెలియని ధైర్యం కలుగుతుందని, మనపై నమ్మకం ఏర్పడుతుందన్నారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె. మోహన్ కుమార్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఏడీసీ వర్మ, ఏసీపీ టీఎస్ఆర్కే ప్రసాద్ ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించిన వినతులు స్వీకరించారు. అన్ని విభాగాల జిల్లాస్థాయి అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

268 వినతుల స్వీకరణ

సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 268 అర్జీలు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 88, జీవీఎంసీకి 91 ఉన్నాయి. అలాగే పోలీసు శాఖకు 20 వినతులు రాగా, ఇతర విభాగాలకు సంబంధించి 69 వచ్చాయి.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కమిషనర్ విశ్వనాథన్

జీవీఎంసీ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 102 వినతులు

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 102 వినతులు అందాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్ ఫిర్యాదులు స్వీకరించారు. వీటిలో జోన్-2కు 12, జోన్-3కి 28, జోన్-4 కు 8, జోన్-5కు 19, జోన్-6కు 14, జోన్-8కి 6 ఫిర్యాదులు అందగా, జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి సంబంధించి 15 ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన సిటీ ప్లానర్ సురేష్‌కుమార్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

90 ఫిర్యాదుల స్వీకరణ

విశాఖ సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జాయింట్ సీపీ డాక్టర్ కె.ఫకీరప్ప పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 90 ఫిర్యాదులు వచ్చాయి. జాయింట్ సీపీతో పాటు ఇతర ఉన్నతాధికారులు ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. వాటిపై వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి సత్వరమే పరిష్కరించాలని చెప్పారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న జేసీపీ ఫకీరప్ప

నాకవుట్‌కు లయన్స్

కింగ్స్, వారియర్స్ కూడా..



అర్ధసెంచరీ చేసిన తేజ, ధీరజ్



నాకవుట్‌కు చేరిన లయన్స్ ఆటగాళ్ల ఆనందం

విశాఖ స్పోర్ట్స్: ఏపీఎల్ మూడో సీజన్ నాకవుట్‌కు ఉత్తరాంధ్ర లయన్స్ చేరుకుంది. వైజాగ్ వారియర్స్‌పై 14 పరుగుల తేడాతో విజయం సాధించింది. వైఎస్సార్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన వారియర్స్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన లయన్స్ ఆరు వికెట్లు కోల్పోయి 197 పరుగులు చేసింది. ఓపెనర్ తరుణ్ (60), మరో బ్యాటర్ ధీరజ్ కుమార్ 25 బంతుల్లో అర్ధసెంచరీ నమోదు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన వారియర్స్ జట్టులో ఓపెనర్లు అశ్విన్ (20), కెప్టెన్ భరత్ (18) తక్కువ పరుగులకే పెవిలియన్ చేరుకున్నారు. దీంతో జట్టు కష్టాల్లో పడింది. 63 పరుగులకే 5 వికెట్లు చేజార్చుకుంది. మరో వైపు వికెట్లు పడుతున్నా తేజ, యువన్ కలిసి స్కోరు బోర్డును పరుగులెత్తించాడు. ఈ క్రమంలో తేజ అర్ధసెంచరీ నమోదు చేశాడు. యువన్ కేవలం 29 బంతుల్లో 65 పరుగులు చేసి విజయం వైపు ఆశలు కల్పించాడు. అయితే తరువాత వికెట్ల పతనం ప్రారంభ కావడంతో వారియర్స్ జట్టు 183 పరుగులకు ఆలౌటైంది. దీంతో నాలుగు మ్యాచ్‌ల్లో మూడింట విజయంతో పన్నెండు పాయింట్లు సాధించి ఉత్తరాంధ్ర లయన్స్ జట్టు నాకవుట్‌కు చేరింది. ఐదు మ్యాచ్‌లు ఆడి 12 పాయింట్లు సాధించిన వారియర్స్ కూడా ప్లేఆఫ్‌కు చేరుకుంది.

కింగ్స్‌కు మరో విజయం

మరో మ్యాచ్‌లో బెజవాడ టైగర్స్‌పై రాయలసీమ కింగ్స్ విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన కింగ్స్ జట్టు ఎనిమిది వికెట్లకు 171 పరుగులు చేసింది. ప్రశాంత్ 60, రోషన్ 16, వంశీకృష్ణ 18, కుమార్ 27, రోహిత్ 32 (నాటౌట్) పరుగులు చేశారు. హరిశంకర్, లలిత్ రెండేసి, సాయిరాహుల్ మూడు వికెట్లు తీశారు. ప్రతిగా బ్యాటింగ్ చేసిన బెజవాడ టైగర్స్ ఓపెనర్ ధృవ్(2)ను ఎనిమిది పరుగుల వద్ద కోల్పోయింది. కెప్టెన్ మహీప్(45) నిలకడగా ఆడి రెండో వికెట్‌గా 66 పరుగుల వద్ద వెనుతిరిగాడు. 31 పరుగులు జోడించి మరో మూడు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. రెడ్డి 21 పరుగులు చేశాడు. చివరికి టైగర్స్ జట్టు 19.1 ఓవర్లలోనే 133 పరుగులకు ఆలౌటై 38 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. అంజనేయులు, కుమార్ చెరో రెండేసి, కమరుద్దీన్ నాలుగు వికెట్లు తీశారు. దీంతో కింగ్స్ లీగ్‌లో ఐదు మ్యాచ్‌లు పూర్తి చేసి పాయింట్ల పట్టికలో పదహారు పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

ఘనంగా ఎన్టీపీసీ సింహాద్రి ఆవిర్భావ దినోత్సవం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆవిర్భావ దినోత్సవాన్ని సంస్థ పరిపాలన భవనం ప్రాంగణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. సంస్థ హెడ్ ఎస్.కె.సిన్హా ఎన్టీపీసీ జెండాను ఆవిష్కరించి గీత్‌ను ప్రారంభించారు. కేక్ కట్ చేసి ఉద్యోగులకు తినిపించారు. అనంతరం ప్రాజెక్టు హెడ్ సిన్హా మాట్లాడుతూ సింహాద్రి పవర్ స్టేషన్ అనేక అడ్డంకులు, సవాళ్లను అధిగమించి శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రతిభ కనబర్చినందుకు ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందించారు. 2023 – 2024లో సంస్థ సాధించిన విజయాన్ని ప్రశంసించారు. 2024 – 2025లో నిర్దేశించిన మైలురాళ్లను చేరుకోవడానికి కష్టపడి పని చేయాలని ఉద్యోగులను కోరారు. వేడుకల్లో భాగంగా స్వచ్ఛత పక్వాడా, ప్రపంచ పర్యావరణ దినోత్సవం, అంతర్జాతీయ యోగా దినోత్సవ పోటీల్లో విజేతలకు ప్రాజెక్టు హెడ్ సిన్హా బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు హెడ్ సిన్హా సంస్థలో పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీపీజీ – 3 చీఫ్ జనరల్ మేనేజర్ ఆర్.ఆర్.పరిదా, మెయింటెనెన్స్ జీఎం ఎస్.జె.డేవిడ్, వీపీజీ జీఎం ఎస్.గడ్డం, దీపికా లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూసిన్హా, హెచ్ఆర్ హెడ్ బి.బి.పాత్ర, జీఎంలు, హెడ్‌వోడీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు సమష్టి కృషి చేయాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట : కుష్టు వ్యాధి నిర్మూలనకు అధికారులంతా సమష్టి కృషి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు జిల్లాలో చేపట్టనున్న వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్, కరపత్రాలను సోమవారం కలెక్టర్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, జిల్లా కుష్టు నివారణ అధికారి పూర్ణేంద్రబాబు, ఇతర జిల్లా స్థాయి అధికారులు భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి లక్షణాలపై విరివిగా అవగాహన కల్పించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలల్లో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో అందరూ భాగస్వామ్యం కావాలని అధికారులను ఆదేశించారు.

అగనంపూడిలో దారుణ హత్య

అత్తతో వివాహేతర సంబంధం ఉన్న వ్యక్తే హంతకుడు


ఆస్పత్రి వద్ద విలపిస్తున్న కిరణ్ బంధువులు


దాడి సూర్య కిరణ్ మృతదేహం (ఇన్‌సెట్) కిరణ్ (ఫైల్)


వివరాలు సేకరిస్తున్న సీఐ ఎర్రంనాయుడు

అగనంపూడి: అగనంపూడి జాతీయ రహదారి కూడలి వద్ద యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మల్కాపురానికి చెందిన దాడి సూర్యకిరణ్ (25) శ్రీనగర్‌కు చెందిన పసుపులేటి మేఘనను కొద్దికాలం కిందట వివాహం చేసుకున్నాడు. ఈ పెళ్లి ఇష్టంలేక పోవడంతో తల్లి సుజాతకు కుమార్తె, అల్లుడికి మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ క్రమంలో కిరణ్ మేఘనను తీసుకొని హైదరాబాద్ వెళ్లి అక్కడ ట్యాక్సీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మేఘన గర్భవతి కావడంతో హైదరాబాద్ నుంచి తీసుకువచ్చి డెలివరీ కోసం అగనంపూడి ఆస్పత్రిలో చేర్పించాడు. గత నెల 30న ఆమెకు బిడ్డ పుట్టడంతో కిరణ్ చూడడానికి ఆస్పత్రికి వచ్చాడు. కాగా సుజాత మూడు రోజుల కిందట కుమార్తె, మనమడును చూడడానికి ఆస్పత్రికి వచ్చింది. దీంతో కిరణ్ ఆమెను వారిని చూడడానికి నిరాకరించడంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని సుజాత తనతో వివాహేతర సంబంధం నడుపుతున్న గంగవరానికి చెందిన వడ్డీ వ్యాపారి కొర్లయ్యకు చెప్పింది. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి కిరణ్ అతని సోదరుడు ప్రసాద్‌తో కలిసి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారి మరిడిమాంబ కూడలి వద్ద వారిని అడ్డగించి కొర్లయ్య కిరణ్‌పై కత్తితో దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో హుటాహుటిన కిరణ్‌ను సమీపంలోని అగనంపూడి ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధృవీకరించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కొర్లయ్యను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. అగనంపూడి ఆస్పత్రి వద్ద సీఐ ఎర్రంనాయుడు వివరాలు సేకరించారు. మృతుడి కుటుంబీకులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఉక్కు యాజమాన్యం ఉత్తర్వులపై ఆగ్రహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సోమవారం జారీ చేసిన రెండు ఉత్తర్వులపై ఉద్యోగుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. యాజమాన్యం వ్యవహరించిన తీరుపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. స్టీల్‌ప్లాంట్ గేట్లు వద్ద, ప్లాంట్‌లోని విభాగాల్లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది బ్రీత్ ఎనలైజర్‌తో తనిఖీలు చేస్తారని, ఉద్యోగులు సహకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఒకవైపు జీతాలు అందక ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులను తాగుబోతులుగా భావించి తనిఖీలు చేస్తానని చెప్పడంపై ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక పరిస్థితులను ఎదుర్కోవడానికి మీ జీతం నుంచి స్వచ్ఛంద విరాళాలు ఇవ్వడం లేదా జీతంలో కొంత భాగాన్ని నిర్దిష్ట కాలానికి వాయిదా వేయమని అభ్యర్థిస్తున్నట్టు మరో ఉత్తర్వు జారీ చేయడం ఉద్యోగులను ఆశ్చర్యానికి గురి చేసింది. ఏడేళ్లుగా వేతన సవరణ జరగకుండా పాత జీతాలతో నెట్టుకురావడంతో పాటు ఒక్కొక్క సదుపాయం కోల్పోతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఉద్యోగులకు ఈ ఉత్తర్వులు అశనిపాతంగా మారింది. నెల జీతాన్ని నెలాఖరుకు రెండు భాగాలుగా ఇస్తున్నా అర్థం చేసుకుంటున్న ఉద్యోగుల పట్ల యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరును కార్మిక సంఘాలు, అసోసియేషన్లు తీవ్రంగా విమర్శిస్తున్నాయి.

రైల్వేస్టేషన్‌లో గంజాయి స్వాధీనం


గంజాయి నిందితులతో పోలీసులు

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వేస్టేషన్ కేంద్రంగా గంజాయి రవాణా చేస్తున్న నలుగుర్ని రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. విశాఖ జీఆర్పీ ఎన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణల ఆధ్వర్యంలో విశాఖ రైల్వేస్టేషన్‌లో సోమవారం పలు ప్లాట్‌ఫారాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో హర్యానాకు చెందిన జితేందర్ (38), జితేందర్ (33), దీపక్(32), రాజ్‌కుమార్‌ల బ్యాగులను తనిఖీ చేశారు. రూ1.58లక్షల విలువైన సుమారు 31.6 కేజీల గంజాయిని అక్రమంగా రవాణా చేయడం గుర్తించారు. గంజాయిని స్వాధీనం చేసుకుని వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచినట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లకు ఆటంకం

మురళీనగర్: ఇంజినీరింగ్ ప్రవేశాలకు కౌన్సెలింగ్‌లో భాగంగా వెబ్ ఆప్షన్లు ఎంపికకు సోమవారం సర్వర్ పనిచేయకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి. సోమవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు ఆప్షన్లు ఎంపిక చేసుకోవచ్చని ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ షెడ్యూలు ప్రకటించింది. కానీ మొదటి రోజు వెబ్‌సైట్‌లో వెబ్ ఆప్షన్ల ఎంపికకు సంబంధించి సైట్ ఓపెన్ కాలేదు. కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్, కంచరపాలెం గైస్‌లకు వెబ్ ఆప్షన్లు పెట్టుకోవడానికి అనేక మంది విద్యార్థులు చేరుకుని నిరాశతో వెనుతిరిగారు. మొదటి రోజు వెబ్‌సైట్‌లో టెక్నికల్ సమస్య వల్ల ఒక రోజు గడువును కోల్పోయినందున షెడ్యూల్‌లో వెబ్ ఆప్షన్లకు మరో రోజు పెంచాలని విద్యార్థులు కోరుతున్నారు. సాంకేతిక విద్యాశాఖ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని పలువురు తల్లిదండ్రులు కోరుతున్నారు.

హిందీ విభాగ ఆచార్యునిపై ఏ చర్యలు తీసుకున్నారు?

- లైంగిక వేధింపుల ఆరోపణలపై జాతీయ మహిళా కమిషన్ నోటీసులు
- ప్రత్యక్షంగా హాజరై కమిషన్‌కు తెలపాలని ఏయూ అధికారులకు ఆదేశం

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగం ఆచార్యుడు నల్ల సత్యనారాయణపై గతంలో వచ్చిన లైంగిక వేధింపుల ఫిర్యాదుపై ఎటువంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని జాతీయ మహిళా కమిషన్ ఏయూ అధికారులను ఆదేశించింది. ఈ మేరకు ఈ నెల 3వ తేదీన జాతీయ మహిళా కమిషన్ తరఫున అండర్ సెక్రటరీ షాలినీ రస్తోగి ఏయూకు నోటీసు పంపారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 11.30 గంటలకు ఏయూ ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా కమిషన్ ముందు హాజరుకావాలని ఈ నోటీసులో పేర్కొన్నారు. హిందీ విభాగాధిపతిగా, రీసెర్చ్ గైడ్‌గా ఉన్న ఆచార్య నల్ల సత్యనారాయణ తనను లైంగికంగా వేధించారని, పీహెచ్‌డీ థీసిస్ సబ్మిట్ చేయడానికి డబ్బులు డిమాండ్ చేశారని విభాగ పరిశోధక విద్యార్థిని సోనాలీ ఘటక్ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. దీనిపై జాతీయ మహిళా కమిషన్ విచారణ జరిపి సదరు ఆచార్యునిపై చర్యలు తీసుకోవాలని ఏయూకు సూచించింది. గతంలో ఏయూ ఇంటర్నల్ కంప్లైంట్స్ సెల్ ఆధ్వర్యంలో విచారణ జరిపి, ఇరువర్గాల నుంచి వివరాలు సేకరించారు. ఆరోపణల ఎదుర్కొంటున్న సదరు ఆచార్యుడిని విభాగాధిపతి పదవి నుంచి ఏయూ అధికారులు తప్పించారు. దీనిపై తాజాగా జాతీయ మహిళా కమిషన్ ఏయూకు నోటీసు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 19న ప్రత్యక్షంగా ఏయూ ఉన్నతాధికారులు కమిషన్ ముందు హాజరై యాక్షన్ టేకెన్ రిపోర్ట్ అందించాలని ఆదేశించింది. ఏయూ అధికారులు హాజరు కాని పక్షంలో కమిషన్ తదుపరి చర్యలు తీసుకుంటుందని హెచ్చరించింది.

గ్యాస్ వినియోగదారుల కేవైసీ పాట్లు


బ్యాంకు కాలనీలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ వద్ద క్యూలో వద్ద వినియోగదారులు

తగరపువలస: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వంట గ్యాస్ వినియోగంపై సబ్సిడీ, ఉచిత సిలిండర్లు పంపిణీ వంటి హామీలపై వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. ఏడాది కాలంగా గ్యాస్ పంపిణీ సంస్థలు వినియోగదారులను కేవైసీ చేయించుకోవాలని కోరుతున్నారు. ఎన్నికల ముందు, తర్వాత ఏ క్షణమైనా కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్‌పై సబ్సిడీ ప్రకటిస్తుందని, దానికి కేవైసీ చేయించుకున్నవాళ్లే అర్హులని ప్రకటించారు. వంట గ్యాస్ యజమానులు చనిపోయినా, ఎవరి పేరు మీదైనా మార్చడానికి కూడా ఏర్పాట్లు చేశారు. ఈ సంస్థలు గ్రామాల్లో కూడా ఒక్కో రోజు కేవైసీకి ఏర్పాట్లు చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ప్రకటించడంతో ప్రస్తుతం వినియోగదారులంతా ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారు. దీంతో వాటి యజమాన్యాలు కేవైసీ చేయడానికి మనుషులను నియమించినా క్యూ లైన్లు తగ్గడం లేదు. ఈ కేవైసీ పూర్తయ్యే వరకు పంచాయతీల్లోనో, సచివాలయాల్లోనో ఏర్పాట్లు చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. గ్రామాల నుంచి ఏజెన్సీల వద్దకు చేరుకోవడానికి వ్యయ ప్రయాసలతోపాటు గంటల కొద్దీ క్యూ లైన్లలో నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు.

రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకులో అక్రమాలు


మాట్లాడుతున్న ఆర్‌సీ సాహు

తాటిచెట్లపాలెం: రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును పరిరక్షించుకోవలసిన బాధ్యత రైల్వే ఉద్యోగులదేనని ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఎన్ఎఫ్ఐఆర్ అడిషనల్ జాయింట్ సెక్రటరీ ఆర్‌సి సాహు సూచించారు. సోమవారం యూని యన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులో కోట్లాదిరూపాయలు పైగా షేర్ హోల్డర్ల డిపాజిట్ సొమ్ము గల్లంతైందని, షేర్ హోల్డర్లకు ఇవ్వాల్సిన సుమారు రూ.100 కోట్లకు పైబడిన డివిడెండ్లు చెల్లించలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఉన్న డైరెక్టర్లు అవినీతి, అక్రమాలకు పాల్పడి, పదేళ్లుగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు జరగకుండా చేశారని ఆరోపించారు. ఇప్పటికే ఈ అంశంపై సీబీఐ, విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో అర్బన్ బ్యాంకుకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, ఈస్ట్‌కోస్ట్‌రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రాంతీయ స్థాయి బాస్కెట్ బాల్ పోటీల ప్రారంభం


బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్


క్రీడాకారులతో ముఖ్యఅతిథులు, పాఠశాల సిబ్బంది

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో ప్రాంతీయస్థాయి అండర్ 14, 17 బాలుర బాస్కెట్‌బాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను కేంద్రీయ విద్యాలయ చైర్మన్, వాల్తేర్ డివిజన్, డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్ ప్రారంభించారు. అండర్ 14లో మూడు స్కూళ్లు, అండర్ 17లో ఆరు స్కూళ్లకు చెందిన క్రీడాకారులు పోటీలో పాల్గొంటున్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మంగళవారం బహుమతులు, మెడల్స్ అందజేయనున్నట్లు ప్రిన్సిపాల్ కమల్‌జీత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పీటీ మాస్టర్ రియాజ్‌ఖాన్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు ప్రారంభం

కంచరపాలెం: కంచరపాలెం 104 ఏరియా విజయనగర్ కేంద్రీయ విద్యాలయం-1లో రీజినల్ స్థాయి అండర్-14, 17 బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యాలయ ప్రిన్సిపాల్ జి.కిషోర్ నేతృత్వంలో జరిగిన పోటీలను కెప్టెన్ శ్రీరతన్ దీప్‌షోరయన్ ప్రారంభించారు. విద్యార్థుల జీవితంలో క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహదం చేస్తాయన్నారు. ముందుగా విద్యార్థులు సాంస్కృతి ప్రదర్శనలు చేశారు. పోటీల్లో హైదరాబాద్ రీజియన్‌లో 8 కేంద్రీయ విద్యాలయాల నుంచి అండర్ 14, 17 విభాగాల నుంచి 143 మంది పాల్గొంటున్నారు. గెలుపొందిన విద్యార్థులు జాతీయ స్థాయి పోటీకి అర్హత సాధిస్తారని ప్రిన్సిపాల్ కిషోర్ తెలిపారు. కార్యక్రమంలో సంచాలకులు హెచ్ఎం మదీనా మాలిక్, ఆయా పాఠశాలల క్రీడా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.